# నమస్తే తెలంగాణ
## ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, గురువారం 10 ఏప్రిల్ 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

# దండులా కదిలిరావాలి

- రజతోత్సవ సభను విజయవంతం చేయాలి
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే గెలుపు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




సభ విజయవంతం కోసం దయాకర్‌రావు ఫోన్ ద్వారా ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న కేటీఆర్

ఐనవోలు, ఏప్రిల్ 9 : గులాబీ పార్టీ 25 ఏళ్ల పండుగకు లక్షలాది మంది దండులా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రజతోత్సవ మహాసభ సందర్భంగా మండల ఇన్‌చార్జీలు గుజ్జ గోపాల్‌రావు, ఇండ్ల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభకు ఐనవోలు మండలం నుంచి 2 వేల మందికి తగ్గకుండా తరలించాలని పిలుపునిచ్చారు. సభను విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. కేసీఆర్ సీఎంగా లేకపోతే రాష్ట్రం ఎలా ఆగమవుతున్నదన్నది ప్రజలకు అర్థమవుతున్నదన్నారు. విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ అని, ఎడారిగా ఉన్న తెలంగాణను సస్యశ్యామలంగా మార్చాడన్నారు. సాగు, తాగు నీరు, ఉచితంగా 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు బీమా తదితర అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. రేవంత్‌రెడ్డి మోసపూరిత మాటలు నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, ఇప్పుడు కేసీఆర్‌ను ఎప్పుడు ముఖ్యమంత్రిని చేద్దామా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ 100 సీట్లు సాధిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు టికెట్లు కేటాయిస్తామన్నారు. చాలా మంది ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరేందుకు చూస్తున్నారని, స్థానిక నాయకత్వం ఆమోదం లేకుండా చేర్చుకునేది లేదని స్పష్టం చేశారు. కాగా, ఐనవోలు శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గూడ లింగారెడ్డి బీఆర్ఎస్‌లో చేరగా ఎర్రబెల్లి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, డైరెక్టర్లు కుమార్, భూపాల్‌రెడ్డి జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు ఉస్మాన్ అలీ, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, మాజీ సర్పంచులు సురేశ్, స్వామి, సదానందం, కొమురయ్య, మాజీ ఎంపీటీసీ రాజు, ఆత్మ జిల్లా కమిటీ మాజీ డైరెక్టర్లు దేవేందర్, రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 'న భూతో.. న భవిష్యతి' అనేలా సభ జరగాలి

**శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం**

బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ 'న భూతో న భవిష్యతి' అనేలా జరగాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సన్నాహక సమావేశం మధ్యలో దయాకర్‌రావు కేటీఆర్‌కు ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఆకాశమంత స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. 78 ఏళ్ల దేశ చరిత్రలో తెలుగు రాష్ట్రాల్లో ఒక ప్రాంతీయ పార్టీగా పుట్టి 25 ఏళ్ల పాటు కొనసాగుతున్నవి రెండే రెండని, అందులో ఒకటి ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ కాగా, మరొకటి మన ఉద్యమ నేత కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సభ జరుగుతున్నందున నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రం మొత్తానికి ఒక సందేశాన్ని ఇచ్చే ఒక అద్భుతమైన అవకాశమన్నారు. దయాకర్‌రావుకు వర్ధన్నపేట నియోజకవర్గ, జిల్లా బాధ్యతను కేసీఆర్ అప్పగించారని తెలిపారు.



# అంబరాన్నంటేలా రజతోత్సవ సంబురం

## 25 ఏండ్లలో అనేక పోరాటాలు, త్యాగాలు

- కేసీఆర్ నేతృత్వంలో అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి
- మూన్నాళ్ల పార్టీ అన్న చంద్రబాబు, వైఎస్‌కు చెంపపెట్టు
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- ఎల్కతుర్తితో మహాసభ ఏర్పాట్ల పరిశీలన
- పాల్గొన్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల, పెద్ది

ఎల్కతుర్తి, ఏప్రిల్ 9 : అంబరాన్నంటేలా రజతోత్సవ సంబురం జరగనుందని ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. 25 ఏళ్ల క్రితం సుదీర్ఘ చర్చల అనంతరం ఏప్రిల్ 27న గులాబీ జెండా ఊపిరి పోసుకుందన్నారు. అధినేత కేసీఆర్‌తో కలిసి గులాబీ జెండా పట్టుకొని తెలంగాణలోని 10 జిల్లాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నామన్నారు. ఈ క్రమంలో అనేక పోరాటాలు, త్యాగాలు చేశామన్నారు. బుధవారం ఆయన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ కమిషన్ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ అన్ని రంగాల్లో వంచనకు గురైన తెలంగాణను ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక నాటి సీఎం కేసీఆర్ నూతన ఒరవడితో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారన్నారు. పార్టీని ఆవిష్కరించిన సమయంలో నాటి సీఎం చంద్రబాబు, ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇది మూడు రోజుల పార్టీ అని, కొస ఎల్లదని ఎద్దేవా చేసినట్లు గుర్తుచేశారు. తెలంగాణ వచ్చేది లేదు.. సచ్చేది లేదు.. కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికే పార్టీ స్థాపించారని, ఈ ప్రాంత సమస్యలకు పరిష్కారం తామే చూపుతామన్న వెటకారపు మాటలను ప్రజలు మరిచిపోలేదని, బీఆర్ఎస్ ప్రస్థానం వారికి చెంపపెట్టులాంటిదన్నారు. అనేక నిర్బంధాల మధ్య పుట్టుకొచ్చిన టీఆర్ఎస్ పార్టీ ఉధృత ఉద్యమాన్ని నిర్మించి 2014లో తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. 32 రాజకీయ పార్టీలను ఒప్పించి, కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ ఇవ్వక తప్పదనే నిర్ణయానికి వచ్చేలా, పార్లమెంట్‌లో బిల్లు పెట్టేలా చేసిన ఘనత గులాబీ జెండాదన్నారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ పాలనా పగ్గాలు చేపట్టి దేశం మొత్తం ఇటువైపు చూసేలా అభివృద్ధి చేశారని కొనియాడారు. కేసీఆర్ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రికార్డులు సృష్టించామన్నారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధికి ఆటంకం కలిగించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ తరుణంలో గొప్ప బహిరంగ సభ ద్వారా ప్రజలకు మంచి సందేశాన్ని కేసీఆర్ ఇవ్వనున్నారని వెల్లడించారు. ఇందుకోసం వేదికగా ఎల్కతుర్తిని ఎంచుకున్నామన్నారు. స్వచ్ఛందంగా భూములివ్వడమే కాకుండా రైతులే స్వయంగా భూమిని చదును చేస్తుండడాన్ని కొనియాడారు. తెలంగాణ బాగు కోరుకునే పార్టీ బీఆర్ఎస్ అని, రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం భూమి చదును చేస్తున్న మహిళా రైతులతో మాట్లాడిన వినోద్‌కుమార్, భూములు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, నాయకులు ఎల్తూరి స్వామి, తంగెడ మహేందర్, తంగెడ నగేశ్, గొల్లె మహేందర్, కడారి రాజు, దేవేందర్‌రావు, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, దుగ్యాని సమ్మయ్య, గొడిశాల వినయ్, చిట్టిగౌడ్, జూపాక జడ్సన్, హింగె భాస్కర్, రాజేశ్వర్‌రావు, కోరె రాజుకుమార్, ఉట్కూరి కార్తీక్, బొంకూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### నేషనల్ హైవేల పరిశీలన

బహిరంగ సభ జరిగే ప్రాంతంతో పాటు జాతీయ రహదారుల పరిస్థితులను వినోద్‌కుమార్ పరిశీలించారు. కరీంనగర్ నుంచి వరంగల్, వరంగల్-సిద్దిపేట హైవేలను పరిశీలించి పలు రిపేర్లను గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా మరమ్మతు చేయాలని కోరారు. అనంతరం పనులు జరుగుతున్న జాతీయ రహదారులపై చేపట్టాల్సిన చర్యలను చర్చించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ ఆఫీసర్‌ను కలిసేందుకు హైదరాబాద్ వెళ్లారు.

# కదం తొక్కుదాం.. సభను సక్సెస్ చేద్దాం

- తెలంగాణ సాధన కోసం ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్
- రాష్ట్రం కోసం నాడు పదవుల త్యాగం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



బైకు ర్యాలీలో పాల్గొన్న గండ్ర వెంకటరమణారెడ్డి, నాయకులు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 9 : ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు కదం తొక్కి కదలాలని, మహాసభను విజయవంతం చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఆకినపల్లి, ఇప్పలపల్లి, పోతుగల్, కొరికిశాల, గణేశ్‌పల్లి, పెద్దకోమటిపల్లి, పర్లపల్లి, పిడిసిల్ల గ్రామాల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశాల్లో పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితేనే ఈ ప్రాంతానికి న్యాయం జరుగుతుందనే లక్ష్యంతో తన పదవికి రాజీనామా చేసిన కేసీఆర్ 2001 ఏప్రిల్ 27న టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారన్నారు. పార్టీ 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న మహాసభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు వచ్చేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ తీరుపై ప్రజలు అసహనంగా ఉన్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోని పథకాలనే కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్నదని, అనుభవం లేని, అసమర్థ, చేతగాని పాలనతో ప్రజలు అవస్థ పడుతున్నారన్నారు. రైతులకు నీళ్లివ్వకుండా చెక్‌డ్యాంలు ధ్వంసం చేసిన ఘనత ప్రస్తుత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. గ్రామాలకు వెళితే ప్రజలు తమ బాధలు చెప్పుకుంటూ కన్నీరు పెట్టుకుంటున్నారన్నారు. కేసీఆర్ పాలనలోనే తాము బాగున్నామని, అభివృద్ధి కూడా జరిగిందని గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం ఏ ఎన్నిక వచ్చినా గెలిచేది బీఆర్ఎస్ అభ్యర్థులేనన్నారు. రజతోత్సవ సభతో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయని రమణారెడ్డి అన్నారు. కాగా, ఆయా సన్నాహక సమావేశాలకు 200 బైక్‌లతో రమణారెడ్డి ర్యాలీగా వెళ్లారు. పోతుగల్లు గ్రామస్తులు చెరువు సమస్యను దృష్టికి తీసుకురావడంతో వెంటనే సంబంధిత ఏఈకి ఫోన్ చేసి మరమ్మతులు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన అకినెపల్లి మాజీ సర్పంచ్ దూడపాక భద్రయ్య, సీనియర్ నాయకుడు దూడపాక సమ్మయ్య గండ్ర సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేశ్, నాయకులు బెల్లంకొండ శ్యాం సుందర్‌రెడ్డి, పిన్నింటి వెంకట్‌రావు, నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, దానవేని రాములు, రవీందర్‌రావు, లవయ్య, శ్రీధర్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను బొందపెట్టడం ఖాయం

- కడియం పిట్ట బెదిరింపులకు ఎవరూ భయపడరు
- బీఆర్ఎస్ నాయకుడిని జైలులో పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 9 : బీఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్ట్ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు పాతాళంలో బొందపెట్టడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ దళిత నాయకుడు తిప్పారపు విజయ్‌ని బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో పల్లా మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధితులు కేవలం బీఆర్ఎస్‌లోనే కాదు, కాంగ్రెస్ పార్టీలో కూడా ఉన్నారని అన్నారు. చట్టానికి కట్టుబడి ఉన్నాం కాబట్టే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టుల విషయంలో న్యాయస్థానాలను సంప్రదిస్తున్నట్లు తెలిపారు. కడియం శ్రీహరి ఉడుత ఊపులకు, పిట్ట బెదిరింపులకు ఎవరూ భయపడరని పేర్కొన్నారు. దళిత సమాజమంతా కలిసి మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పండుగ వాతావరణంలో జరుపుకుంటున్న తరుణంలో దళిత దొర కడియం శ్రీహరి అమాయక దళిత, గిరిజన నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయించి జైళ్లకు పంపించడాన్ని యావత్ దళిత జాతి క్షమించదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే విధానాన్ని అవలంబిస్తే రాష్ట్రంలో ఉన్న జైళ్లు సరిపోవని ఎద్దేవా చేశారు. కడియం శ్రీహరికి నీతి, నిజాయితీ, దమ్ము, ధైర్యం ఉంటే సక్రమంగా మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, మాజీ ఎంపీపీ బైరగోని యాదగిరి, మాజీ కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, సమద్, మసిఉర్ రెహ్మాన్, నీల యాదగిరి పాల్గొన్నారు.

# సర్వే సరే.. పరిహారమెంత?

*మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అవసరమైన భూమి కోసం సర్వే పూర్తి కాగా, పరిహారంపై చర్చలు కొలిక్కిరావడం లేదు. సుమారు 253 ఎకరాల్లో సర్వే చేయగా, అందులో దాదాపు 300 మంది భూమిని కోల్పోతున్నారు. అధికారులు ఎకరానికి రూ. 50 లక్షల నుంచి 65 లక్షలు పరిహారం ఇస్తామని చెబుతుండగా, రైతులు ఒప్పుకోవడం లేదు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ. 2 కోట్ల వరకు ఉంటుందని, రూ. 1.5 కోట్ల నుంచి 2 కోట్ల వరకు ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో మరోమారు చర్చలు జరుపనున్నారు.* *- కరీమాబాద్, ఏప్రిల్ 9*



- మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణలో కొలిక్కిరాని చర్చలు
- ఎకరానికి రూ. 50 నుంచి 65 లక్షలంటున్న అధికారులు
- రూ. 1.5 కోట్ల నుంచి 2 కోట్లు ఇవ్వాలంటున్న భూయజమానులు
- మరోమారు జరుగనున్న చర్చలు



జిల్లాకు ఎయిర్‌పోర్టు రాకను అందరూ స్వాగతిస్తున్నా, తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ కనబరచడం లేదని భూయజమానులు విమర్శిస్తున్నారు. భూములిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి, ఎమ్మెల్యేలు చర్చించి నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీల అమలు దిశగా చర్యలు చేపట్టడం లేదంటున్నారు. తమకు స్పష్టమైన హామీతో పాటు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

### చర్చల్లో కానరాని స్పష్టత..

ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులతో కలెక్టర్, ఇతర అధికారులు పలు దఫాలుగా చర్చలు జరిపారు. తొలుత ఎకరాకు రూ.50 లక్షలు, ఆ తర్వాత రూ.65 లక్షలు ఇస్తామని అధికారులు చెప్పారు. అయితే బహిరంగ మార్కెట్‌లో భూమి విలువ ఎక్కువగా ఉందని, ఎకరాకు రూ. 1.50 కోట్ల నుంచి 2 కోట్ల వరకు ఇవ్వాలని రైతులు కోరారు. దీంతో మరోమారు చర్చలు జరుపనున్నట్లు అధికారులు తెలిపారు.

### దారి సమస్య.. ధర సమస్య

ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ప్రధానంగా రెండు సమస్యలను లేవనెత్తుతున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారిని మూసివేయక ముందే తమకు ప్రత్యామ్నాయంగా దారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. దీంతో పాటు తమ భూములకు ప్రభుత్వం ఎకరానికి ఎంత మేర చెల్లిస్తుందో ముందే తెలియజేయాలని, అర్హులైన భూనిర్వాసితుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని విన్నవిస్తున్నారు. ఈ విషయాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల మాటల్లో స్పష్టత లేదని రైతులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా తమతో మాట్లాడి భరోసా ఇచ్చే వారు కరువయ్యారని వాపోతున్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

# పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

- హామీల పేరుతో నమ్మించి మోసం
- బీఆర్ఎస్ మానుకోట జిల్లా అధ్యక్షురాలు కవిత
- నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలి : మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్
- కురవిలో రజతోత్సవ సన్నాహక సమావేశం

కురవి, ఏప్రిల్ 9 : అమలు కాని హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని పథకాల అమలులో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత మండిపడ్డారు. 27న జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశం బుధవారం కురవి మండలకేంద్రంలోని ఓం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ముందుగా అప్పులబాధతో కాకులబోడు తండా సర్పంచ్ భర్త గుగులోత్ కిషన్‌నాయక్ ఆత్మహత్య చేసుకోగా సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలలో ఎంపీ మాలోత్ కవిత మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దికాలంలోనే ప్రజల వ్యతిరేకతను చూస్తున్నదని, సంక్షోభంలో పూర్తిగా కూరుకుపోయి సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. కబ్జాలు, కమీషన్లతో కాంగ్రెస్ పాలన సాగుతున్నదని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు ఎవరూ ముందుకురావడం లేదన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి పది వేలకు మించి కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ రైతులను నట్టేట ముంచిందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు తోట లాలయ్య, సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవినాయక్, నూతక్కి సాంబశివరావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బదావత్ రాజునాయక్, నాయిని నరేశ్‌రెడ్డి, నెహ్రూనాయక్, బోడ శ్రీను, ఐలి నరహరిగౌడ్, అల్లూరి కిషోర్ వర్మ, కిన్నెర మల్లయ్య, బండి దీపక్‌గౌడ్, బానోత్ రమేశ్, రాము, గణేశ్, జక్కుల సందీప్, అయిలి వీరేందర్, చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, రాంచంద్రయ్య, పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ సభకు వృద్ధురాలి విరాళం

కురవి మండల తులస్యతండా గ్రామ పరిధిలోని కీమ్యాతండాకు చెందిన బోడ బాజి తన పింఛన్ డబ్బుల నుంచి 1000 రూపాయలను బీఆర్ఎస్ రజతోత్సవ కోసం విరాళమిచ్చారు. ఈమేరకు మాజీ ఎంపీ కవిత మాలోత్‌కు నగదు అందజేశారు.

## పది స్పాట్ నుంచి ముగ్గురు ఉపాధ్యాయుల తొలగింపు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 9 : పదో తరగతి పరీక్షల మూల్యాంకనం విధుల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను బుధవారం తొలగించారు. కాజీపేట ఫాతిమా బాలికల పాఠశాలలో జరుగుతున్న స్పాట్ వాల్యుయేషన్‌లో భూపాలపల్లికి చెందిన ఇద్దరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, మహబూబాబాద్ చెందిన మరొకరు పేపర్లు సరిగా దిద్దకపోవడంతో తొలగించినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఆ ముగ్గురు ఉపాధ్యాయులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈవో వాసంతి ఆదేశాలు జారీ చేశారు.

### వాన నీళ్లు కాదు.. తాగు నీళ్లు



ఈ చిత్రంలో రోడ్డుపై ప్రవహిస్తున్నవి వాన నీళ్లు కాదు.. గ్రేటర్ వరంగల్ శివనగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో ఖమ్మం ప్రధాన రహదారిపై వాల్వ్ లీకేజీ కావడంతో తాగు నీళ్లు వృథాగా పోతున్నాయి. ఇక్కడే సంబంధిత డీఈ, ఏఈ అధికారుల కార్యాలయాలున్నా పట్టించుకునే వారు మాత్రం లేరు.
– ఖిలావరంగల్, ఏప్రిల్ 9

# రిజిస్ట్రేషన్‌కు స్లాట్‌బుకింగ్ తప్పనిసరి

**నేటి నుంచి వరంగల్ రూరల్, ఖిలా వరంగల్‌లో అమలు**

హనుమకొండ, ఏప్రిల్ 9 : ఇప్పటివరకు తహసీల్దార్ కార్యాలయాలకు పరిమితమైన రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ విధానం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఇందుకోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందించింది. ప్రతి ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా ఉమ్మడి వరంగల్‌లో 13 ఆఫీసులకు గాను వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ కార్యాలయాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఆయాచోట్ల నేటి నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమలుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ డి. ఫణిందర్ తెలిపారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో స్లాట్, నాన్ స్లాట్ విధానం అమలులో ఉంది. అయితే ఇక నుంచి స్లాట్ బుకింగ్‌ను తప్పనిసరి చేసింది రాష్ట్ర ప్రభుత్వం. స్లాట్ బుకింగ్ విధానం పైలట్ ప్రాజెక్టుల్లో విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నారు. దీని వల్ల క్రయ, విక్రయదారులు గంటల తరబడి వేచి ఉండకుండా సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

# భవిష్యత్ బీఆర్ఎస్‌దే..

- రజతోత్సవ మహాసభకు కార్యకర్తలు తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలావరంగల్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దేనని వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవాల మహాసభ సన్నాహక సమావేశాన్ని గ్రేటర్ వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపునేని మాట్లాడుతూ బీఆర్ఎస్ 25 ఏళ్లుగా తెలంగాణ ప్రజల ఆశయాలకు అంకితమై పని చేస్తున్నదన్నారు. పార్టీ సాధించిన విజయాలు ప్రతి కార్యకర్త గర్వపడేలా ఉన్నాయన్నారు. రాబోయే రజతోత్సవ మహాసభ కార్యకర్తలకు పండుగలా మారనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని సభకు హాజరయ్యే కార్యకర్తల కోసం మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, భోజన సదుపాయం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే, వరంగల్ 34వ డివిజన్ ఆర్యవైశ్య కమ్యూనిటీ భవనంలో కార్పొరేటర్ కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో నన్నపునేని పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ 37వ డివిజన్ అధ్యక్షుడు విజయ్, నాయకులు సంగరబోయిన ఉమేశ్, బిల్లా రాజు, పోలెపాక రాజు పాల్గొన్నారు. అలాగే, నన్నపునేని పడమరకోటలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు కార్యకర్తలు హాజరై ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్